సాక్షి విశాఖపట్నం

శనివారం । 29 । ఏప్రిల్ । 2023



ఏయూతో అనుబంధం..

వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో సైన్స్ కళాశాల ఎబీవర్స్ డే వేడుకలు జరిగాయి. IIలో



అలరించిన నాట్యం

ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే 2023 వేడుకలను బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద ఘనంగా ప్రారంభమయ్యాయి. IIలో



నేడు వందేభారత్ రీషెడ్యూల్

విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా 9.45 గంటలకు బయల్దేరుతుంది. IIలో

న్యూస్‌రీల్

కేజీబీవీల్లో ఇంటర్ ఫలితాలపై సమీక్ష



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో వచ్చిన ఇంటర్ ఫలితాలపై డీఈవో ఎల్. చంద్రకళ సమీక్షించారు. నగరంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. జిల్లాలోని భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో ఉన్న కేజీబీవీల్లో ఫలితాలు తగ్గిన చోట్ల ఎందుకలా జరిగిందనే వివరాలను ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వచ్చిన ఫలితాలను సమీక్షించుకొని భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్, కేజీబీవీ ప్రత్యేకాధికారి బేగం, విద్యాలయాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు వైద్యుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు వైద్యుల పోస్టులు భర్తీ చేస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్ నిపుణుల నియామకం కోసం అర్హులు దరఖాస్తులు మే 2వ తేదీ సాయంత్రం 5గంటలలోపు డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కేజీహెచ్ గైనిక్ విభాగంలో మూడు పిల్లల వైద్యుల పోస్టులు, జిల్లా ఆస్పత్రి (అనకాపల్లి)లో ఒక పిల్లల వైద్యుడు, జిల్లా ఆస్పత్రి(పాడేరు)లో ఒక పిల్లల వైద్యుడు, అనకాపల్లిలో జనరల్ మెడిసిన్ ఒక పోస్టు భర్తీ చేస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

31 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

- రూ.కోటి 22 లక్షలతో ముడసర్లోవలో గ్యారేజ్ షెడ్
- సీతకొండ మలుపునకు వైఎస్సార్ వ్యూపాయింట్‌గా నామకరణం
- గాజువాకలో వెండర్స్ జోన్‌లకు కౌన్సిల్ ఆమోదం
- గుడివాడ గురునాథరావు జంక్షన్‌కు సభ్యుల అంగీకారం
- దాదాపు 3 గంటల పాటు కొనసాగిన జీరో అవర్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మేయర్ గొలగాని హరివెంకట కుమారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సభ్యుల ముందుకు 31 అంశాలతో పాటు 4 టేబుల్ అజెండాలు వచ్చాయి. వీటిలో అన్ని అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.కోటి 22 లక్షలతో ముడసర్లోవలో గ్యారెజ్ షెడ్, జీ–20 సదస్సులో భాగంగా ఇటీవల అభివృద్ధి చేసిన సీతకొండ మలుపునకు వైఎస్సార్ వ్యూపాయింట్‌గా నామకరణం చేసేందుకు, జోన్–3,4లో వెండింగ్ జోన్ల ఏర్పాటుకు సభ్యులు ఆమోదించారు. గాజువాకలో కూడా వెండర్స్ జోన్ ఏర్పాటు చేయాలని గాజువాక కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు అక్కడ కూడా వెండింగ్ జోన్ ఏర్పాటుకు మేయర్ అధ్యక్షతన ఆమోదం తెలిపారు. అలాగే పరిపాలన, అభివృద్ధి పనులకు సంబంధించి సభ్యులు ఆమోదం తెలిపారు.

అధికారుల తీరుపై అసంతృప్తి

జీవీఎంసీ అధికారులపై కౌన్సిల్ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల్లో సమన్వయం కొరవడిందంటూ విరుచుకుపడ్డారు. సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు అభివృద్ధి పనులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోతోందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ వద్ద మొర పెట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డుల అభివృద్ధి..స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని వేడుకున్నారు.

కౌన్సిల్ జరిగిన తీరు..

ఉదయం 11 గంటలకు నగర మేయర్, కౌన్సిల్ చైర్ పర్సన్ హరివెంకటకుమారి సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా మాజీ కార్పొరేటర్ గోగినేని సాంబశివరావు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం అజెండాలోకి వెళ్లేందుకు మేయర్ అనుమతించారు. జీరో అవర్ కేటాయించాలని, స్థానిక సమస్యలపై చర్చించాలని, ముఖ్యంగా అధికారుల తీరు బాగులేదంటూ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో మేయర్ స్పందించి సభ్యులందరికీ అవకాశం కల్పిస్తాం. క్లుప్తంగా సమస్యను చెప్పండంటూ సభ్యులకు అనుమతిచ్చారు. ఉదయం 11.20 గంటలకు ప్రారంభమైన జీరో అవర్ మధ్యాహ్నం 2.30 గంటల వరకు కొనసాగింది. దాదాపు 98 మంది సభ్యుల్లో 40 నుంచి 50 మంది తమ సమస్యలు విన్నవించుకున్నారు.

ఎవరేమన్నారంటే..

ముందుగా 56వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ వార్డులో విపరీతంగా పందులు తిరుగుతున్నాయని, వార్డు సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మిగతా IIవ పేజీలో ›

సీఎం వైఎస్ జగన్ విశాఖ పర్యటన ఖరారు

- 3న భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన
- మధురవాడలోని వైజాగ్ ఐటీ టెక్ పార్కుకు శ్రీకారం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఖరారైంది. మే 3న ఉదయం 8 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రాయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో విజయనగరం జిల్లా భోగాపురం మండలం ఎ.రావివలస గ్రామంలో గల హెలిప్యాడ్ వద్దకు 10 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 10.25 గంటలకు జీఎంఆర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు చేరుకుని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సభ ముగిసిన తర్వాత 12.30కి బయలుదేరి ఎ.రావివలస గ్రామం వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ స్థానిక రాజకీయ నాయకులతో సుమారు 40 నిమిషాలపాటు సమావేశమవుతారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ ఐటీ హిల్స్ నంబర్ 3 వద్ద గల హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. రోడ్డు మార్గంలో బయలుదేరి ఐటీ హిల్స్ నంబర్ 4లో గల వేదిక వద్దకు 2 గంటలకు చేరుకుంటారు. అక్కడ 30 నిమిషాలపాటు ఉంటారు. అనంతరం 2.30 గంటలకు "వైజాగ్ ఐటీ టెక్ పార్కు" శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. 10 నిమిషాలపాటు ఫొటో ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. అనంతరం పారిశ్రామికవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి 3.50 గంటలకు బయలుదేరి రుషికొండలో గల బాలాజీ బే మౌంట్ విల్లా ఎదురుగా ఉన్న విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రెసిడెన్సీకి చేరుకుంటారు. ఎంపీ కుమారుడు దంపతులను ఆశీర్వదిస్తారు. అక్కడి నుంచి 4.35 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ 20 నిమిషాలపాటు స్థానిక రాజకీయ నేతలతో ఇంట్రాక్ట్ అవుతారు.

అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి 5.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కి 6.20కి చేరకుని రోడ్డు మార్గాన తాడేపల్లిలో గల తన నివాసానికి చేరుకుంటారు. ఈ మేరకు సీఎం పర్యటన వివరాలను కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం వెల్లడించారు.

మరో ప్రధాన ప్రాజెక్టుకు రైల్వే బోర్డు ఆమోదం

విశాఖ–గోపాలపట్నం 3,4 లైన్లకు గ్రీన్ సిగ్నల్



డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): వాల్తేర్ డివిజన్‌కు ఎంతో ప్రధానమైన, అత్యవసరమైన విశాఖపట్నం–గోపాలపట్నం 3,4 లైన్లకు శుక్రవారం రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. దీనికోసం రూ.159.47 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ఆ వివరాలను వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. ఈ ప్రాజెక్టు వలన విశాఖపట్నం రాకపోకలు సాగించే రైళ్ల వేచి ఉండే సమయం తగ్గుతుందని, ప్రయాణ వేగం కూడా పెరుగుతుందన్నారు. రైళ్లకు, గూడ్స్‌కు కూడా వేగ సామర్థ్యం పెరుగుతుందని డీఆర్‌ఎం తెలిపారు.

డీఆర్‌ఎం కృషితో నిధులు: విశాఖ రైల్వే స్టేషన్‌కు రాకపోకలు సాగించే పలు ప్రధాన రైళ్లు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు ఖాళీలేక ఔటర్‌లో గంటల కొద్దీ నిలిచిపోవడం ఇంత వరకు చూశాం. ఈ సమస్యను పరిష్కరించేందుకు డీఆర్‌ఎం కృషి చేశారు. విశాఖపట్నం–గోపాలపట్నం మధ్య సుమారు 15.31 కిలోమీటర్ల మేర మూడు, నాలుగో లైన్‌లు నిర్మిస్తే ఈ సమస్యను పరిష్కరించవచ్చని తెలుసుకున్న ఆయన వెంటనే కార్యాచరణలో పెట్టి విజయం సాధించారు. ఇటీవల వాల్తేర్ డివిజన్‌లో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న మూడు ప్రధాన ప్రాజెక్టులను సైతం డీఆర్‌ఎం మంజూరు చేయించగలిగారు. ఈ ప్రాజెక్టును మంజూరు చేసినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు డీఆర్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మహారాణిపేట : జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆస్పత్రులు, క్లినిక్ ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్ట్ 2002 ప్రకారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంటు యాక్టు –2002 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందువల్ల రిజిస్ట్రేషన్ లేని వారందరు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బడితెరిచే రోజునే విద్యాకానుక కిట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ, జిల్లా స్థాయి అధికారులు

విశాఖ విద్య: జగనన్నకు చెబుతాం కార్యక్రమం మే 9న ప్రారంభమౌతున్నందున జిల్లాలో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులంతా పాల్గొన్నారు.

జగనన్నకు చెబుతాం, జగనన్న హౌసింగ్, జగనన్న భూ హక్కు–భూ రక్ష, నాడు–నేడు తదితర కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం అంకిత భావంతో పనిచేయాలని సీఎం జగన్ మోహన్ రెడ్డి సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు తెరిచిన తొలిరోజునే విద్యా కానుక కిట్లు విద్యార్థులందరికీ అందించేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, డీఈవో ఎల్. చంద్రకళ డిప్యూటీ కలెక్టర్లు, హౌసింగ్ తదితర శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐఐటీ, నీట్‌లపై శశిలో అవగాహన సదస్సు రేపు

తగరపువలస: సంగివలస శశి విద్యాసంస్థల ఆవరణలో ఈ నెల 30న నీట్, ఐఐటీలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆ సంస్థ చైర్మన్ బూరుగపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఈ సదస్సులో అనుభజ్ఞులైన అధ్యాపకులతో విద్యార్థులు, తల్లిదండ్రులకు నీట్, ఐఐటీలపై సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని 7వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు వినియోగించుకోవాలని వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఈడీ మేక్రా క్రాంతి సుధ తెలిపారు. మరిన్ని వివరాలకు 97059 25599, 97056 35599లో సంప్రదించవచ్చు.

ఆకట్టుకుంటున్న ఎక్స్‌పో

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ డీ– బ్లాక్, గోపాల్ ఇంజినీరింగ్, సరిపల్లి గ్రాండ్‌లో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ కం బిజినెస్ ఎక్స్‌పో–2023 ఆకట్టుకుంటోంది. ఎక్స్‌పోలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను రెండో రోజైన శుక్రవారం పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు సందర్శించారు. విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆలోచింపజేశాయి. కళాశాల రెక్టార్ డాక్టర్ వి.మధుసూదన్, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ గిరిష్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకృష్ణ, సీఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

30న ఏకలవ్య పాఠశాలల ప్రవేశ పరీక్ష

మధురవాడ: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 30న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. దీనికి సంబంధించి మారికవలస–తిమ్మాపురం రోడ్డులోని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఇంగ్లిష మీడియం స్కూలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ ఎల్. శివప్రసాద్ తెలిపారు. దరఖాస్తు చేయని వారికి కూడా పరీక్ష రాయడానికి అనుమతిస్తున్నట్టు తెలిపారు.

ఏయూతో అనుబంధం కొనసాగించండి

- వర్సిటీ అభ్యున్నతికి మీ మేదస్సును వినియోగించాలి
- విద్యార్థులతో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఘనంగా సైన్స్ కళాశాల విజేతల దినోత్సవం


మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: 'ఆంధ్ర విశ్వవిద్యాలయం మీ అందరిదీ.. భవిష్యత్ తరాలకు విద్యనందించే సమున్నత కేంద్రంగా ఏయూ మరింతగా ఎదగాలంటే.. మీ మేదస్సునే సంపదగా అందించాలి' అని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం సైన్స్ కళాశాల ఎచీవర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి వర్సిటీ నుంచి వెళ్లిన తర్వాత కూడా తన అనుబంధాన్ని కొనసాగించాలని సూచించారు. ఒకే వేదికపై 761 మంది విద్యార్థులకు నియామకపత్రాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. మరో వంద మందికిపైగా విద్యార్థుల నియామక పత్రాలు రావాల్సి ఉందన్నారు. వర్సిటీలో విద్యార్థులు ఆలస్యంగా చేరినా.. ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా సకాలంలో తరగతులు, పరీక్షలు నిర్వహించడం వల్ల ఇంతటి ఘన విజయం సాధ్యపడిందన్నారు. విశ్వ విద్యాలయంలో పూర్తి స్థాయిలో అకడమిక్ వాతావరణం నెలకొల్పామని, విద్యార్థులకు ఆవిష్కర్తలుగా మార్చడానికి ఇంక్యుబేషన్, స్టార్టప్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు దీటుగా సైన్స్ కోర్సులు చదివిన విద్యార్థులు రూ.లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి, నియామక పత్రాలను అందజేశారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్.రెడ్డి, ప్రిన్సిపాళ్లు, డీన్స్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

రూ.10.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం



ఏయూ స్టాటస్టిక్స్ విభాగంలో పీజీ చేస్తున్నాను. ఫాక్ట్‌సెట్ సాఫ్ట్‌వేర్ సంస్థలో 10.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం లభించింది. ఇంత మంచి వేతనంతో ఉద్యోగం రావడం ఆనందాన్నిస్తోంది. వర్సిటీ అధికారుల ప్రోత్సాహంతో ఇది సాధ్యపడింది.

– మంథ కృష్ణ వాసవి, స్టాటస్టిక్స్ విభాగం

ఆచార్యుల ప్రోత్సాహంతో..



ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సు చేసిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగం వచ్చింది. నేను రెడ్డీస్ ల్యాబ్స్ సంస్థకు ఎంపికయ్యాను. ఇంటర్వ్యూకు ఎలా సిద్ధమవ్వాలి అనే అంశంపై ప్లేస్‌మెంట్ అధికారి తగిన శిక్షణ, మార్గనిర్దేశం చేశారు. ఇంటర్వ్యూ విధానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతో ఉద్యోగం సాధించడం సులభమైంది.

– ఎం.అంజలి, కెమిస్ట్రీ విభాగం

మూడు ఉద్యోగాలు వచ్చాయి



ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రాథమిక, ఉన్నత విద్యనభ్యసించాను. డిగ్రీ డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలలో పూర్తిచేశాను. ఏపీపీజీసెట్‌లో 84వ ర్యాంక్ సాధించి ఏయూలో ఎమ్మెస్సీ మ్యాథ్‌మేటిక్స్‌లో చేరాను. ఆచార్యుల బోధన నా ఉన్నతికి ఎంతో ఉపయుక్తంగా నిలిచింది. మూడు సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యాను.

– ఎం.సలోమి రాణి, మ్యాథ్‌మేటిక్స్ విభాగం

ఇంటర్ విద్యార్థిపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

సీతమ్మధార: ఇంటర్ విద్యార్థిపై దాడి చేసిన సునీల్‌తో పాటు మరో ఇద్దరిపై నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలివీ.. అక్కయ్యపాలెంలోని రామకృష్ణనగర్‌కు చెందిన విద్యార్థి నాగ కిరణ్(17) ఇంటర్మీడియట్ పరీక్షలు తప్పడంతో గురువారం వారి ఇంటికి దగ్గరలోని ఓ పాత కారులో దిగాలుగా కూర్చొని ఉన్నాడు. సునీల్ కుమార్, కారు డ్రైవర్ గణేష్, మరో వ్యక్తి అక్కడకు వచ్చి కారు దొంగతనం చేయడానికి వచ్చావంటూ మూకుమ్మడిగా కిరణ్‌పై దాడి చేశారు. నేను దొంగను కాను.. మా ఇల్లు పక్కనే ఉంది అని చెప్పినా వినకుండా.. ఇంట్లోకి తీసుకెళ్లి దుస్తులు విప్పి కొట్టారు. విషయం తెలుసుకున్న తల్లి.. తన కుమారుడిని దారుణంగా కొట్టారని నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసరావు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. ఈ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పోలీసులను కోరారు.

నేడు వందేభారత్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం : విశాఖ–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. సికింద్రాబాద్–విశాఖ వందే భారత్ ఆలస్యంగా విశాఖపట్నం చేరడంతో.. శనివారం విశాఖ నుంచి బయల్దేరాల్సిన వందేభారత్‌ను రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 5.45 గంటలకు విశాఖలో బయల్దేరవలసిన ఈ రైలు.. ఉదయం 9.45 గంటలకు బయల్దేరుతుందని చెప్పారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

31 అంశాలకు కౌన్సిల్ ఆమోదం


సాంబశివరావుకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు


కౌన్సిల్ తరఫున కమిషనర్‌ను సత్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

మొదటి పేజీ తరువాయి

పట్టించుకోవడం లేదన్నారు. 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి వార్డులో ఏ పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. పూర్తి స్థాయిలో రోడ్లు వేయమంటే ప్యాచ్ వర్క్‌లు మాత్రమే చేస్తున్నారని కౌన్సిల్ ముందుకు తీసుకురాగా..సీఈ రవికృష్ణంరాజు స్పందిస్తూ 2, 3 నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీనిచ్చారు.

- తమ వార్డులో సమస్యలు త్వరగా పూర్తి చేయాలని 49వ వార్డు కార్పొరేటర్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవిందరాజు అల్లు శంకరరావు కోరారు. చెత్తపై పన్ను రద్దు చేయాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత కోరారు. తుంగ్లంలో శ్మశానవాటిక అభివృద్ధి పరచాలని, నాతయ్యపాలెం జాతీయ రహదారి నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్ వరకు శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు. 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్ మాట్లాడుతూ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన టాయ్‌లెట్ల మరమ్మతులు రూ.10వేలు కూడా ఖర్చు కాదని, కానీ రూ.2.40లక్షల బిల్లు పెట్టడమేంటని ప్రశ్నించారు. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మాట్లాడుతూ వార్డులో యూపీహెచ్‌సీ నిర్మాణం జరపాలన్నారు. వార్డు పరిధిలో పార్కులు అభివృద్ధి చేయాలని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి కోరారు. సింహాచలం వద్ద ఎప్పటి నుంచో పరిష్కారం కాకుండా 2 కిలోమీటర్ల రోడ్డు అలానే ఉండిపోయిందని, తక్షణం పూర్తి చేయాలని కార్పొరేటర్ పిసిని వరహాలక్ష్మీ నరసింహం కోరారు. కార్పొరేషన్లో పరిపాలన విభాగం తీరు అధ్వానంగా ఉందని కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు మండిపడ్డారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండేళ్లుగా జీవీఎంసీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులు నిర్వహించలేదని, ఈ ఏడాదైనా నిర్వహించాలని కోరారు. కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ జీ–20 సదస్సుకు సంబంధించి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

కమిషనర్లను మార్చొద్దు..

కౌన్సిల్ ఏర్పాటై రెండేళ్లు పూర్తయ్యింది. ఇంతవరకు నలుగురు కమిషనర్లను చూశాం. స్వల్పకాలంలోనే కమిషనర్లను మార్చే పరిస్థితి ఉండకూడదని సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మేయర్‌ను కోరారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించినందుకు అభినందనలు తెలుపుతున్నానని కార్పొరేటర్ స్టాలిన్ పేర్కొన్నారు.

- గాజువాక జోన్ పరిధిలో గల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న జంక్షన్‌కు మాజీ మంత్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు జంక్షన్‌గా నామకరణం చేసేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. అంతేగాక గుడివాడ గురునాథరావు సేవలు కొనియాడుతూ జీవీఎంసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు గుడివాడ కాంస్య విగ్రహాన్ని కూడా అక్కడ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గాజువాక నియోజకవర్గానికి సంబంధించి గుడివాడ చేసిన సేవలు, అభివృద్ధిని సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కొనియాడారు. అలాగే కార్పొరేటర్ గుడివాడ అనూష గురునాథరావు చేసిన సేవలు కౌన్సిల్ సభ్యులకు వివరించారు.

ఎమ్మెల్యే ముత్తంశెట్టి ఏమన్నారంటే..

ఎన్నికలప్పుడే రాజకీయాలు. ప్రస్తుతం రాజకీయాలు పక్కన పెట్టి సభ్యులందరూ కాలుష్యంపై దృష్టి పెట్టండి. గతంలో 32 డిగ్రీలుంటే..ప్రస్తుతం 35 డిగ్రీల పైబడే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భవిష్యత్తు తరాల కోసం వారంలో ఒక రోజు ప్రతి ఒక్క సభ్యుడు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టండి. సమస్యలుంటే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లకుండా..జోనల్ కమిషనర్లను బాధ్యులు చేయాలన్నారు. జీవీఎంసీ పరిధిలో 700 ఖాళీ ప్రదేశాలున్నాయి. అన్యాక్రాంతమవ్వకుండా ఆయా స్థలాల్లో మొక్కలు నాటండి. జీవీఎంసీ ద్వారా హెల్త్ క్యాంపులు, సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి అన్నారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను మేయర్ సభ్యులకు పరిచయం చేస్తూ.. కౌన్సిల్ తరఫున సత్కరించారు.

తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెర

రాజన్న ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు ఖాజావలీ


ఆర్డర్ కాపీతో యూనియన్ నాయకులు

జగదాంబ: తొమ్మిదేళ్ల నిరీక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెరదించారని రాజన్న ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు పటాన్ ఖాజావలీ హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఆటో నగర్ స్పేర్ పార్ట్స్ అండ్ స్క్రాప్ డీలర్స్ యూనియన్ అభ్యర్థన మేరకు ఆనందపురం మండలం కనమం సర్వే నంబర్ 50లో 157.77 ఎకరాలను ఆటోనగర్‌కు కేటాయించారని చెప్పారు. ఎకరానికి రూ.19 లక్షలు చొప్పున నిధులు, దానికి కావాల్సిన అనుమతుల మంజూరుకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆటోనగర్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు కోసం తొమ్మిదేళ్లుగా అనేక విధాలుగా శ్రమించామన్నారు. ఆటోనగర్ ఏర్పాటుతో 2,500 కుటుంబాలకు ఆర్థికంగా చేయూత లభిస్తుందన్నారు. మా కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని చెప్పారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాగి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

జేసీ కె.ఎస్.విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చి..అన్నదాతల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులకు సూచించారు. జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగింది. మండలి అధ్యక్షుడిగా జేసీ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సారి రాగి పంటను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని.. ఈ విషయాన్ని రైతులకు తెలియజేసే బాధ్యతను వ్యవసాయ అధికారులు తీసుకోవాలన్నారు. పంట రుణాల అర్హత గల వారికి ఏటా రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను సూచించారు. బొప్పాయి, అరటి, డ్రాగన్ ఫ్రూట్, కూరగాయలు, పామాయిల్ పండించే రైతులను గుర్తించి, వారికి ఆర్బీకే కేంద్రాల ద్వారా రాయితీలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డీవీవీ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలు, పాడి, మత్స్య పరిశ్రమలకు సంబంధించి సూచనలు, సలహాలను రైతులకు అందించాలని కోరారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామ స్థాయిలో చర్చించిన విషయాలను జేసీకి వివరించారు. పశుసంవర్థక, ఉద్యానవన, పట్టు పరిశ్రమ ఇతర అనుబంధ శాఖలు, పౌర సరఫరాల అధికారులు, ఆయా శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. సలహా మండలి సంఘ సభ్యుడు రామారావు, పశుసంవర్థక శాఖ జేడీ రామకృష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ వీఎస్ శర్మ, పౌర సరఫరాల కార్పొరేషన్ డీఎం రోజారాణి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు, మిగతా శాఖల అధికారులు పాల్గొన్నారు.


అలరించిన నాట్యం

మద్దిలపాలెం: బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహం వద్ద శుక్రవారం ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే 2023 వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలి రోజు కార్యక్రమాలను నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, డాక్టర్ మునిషా బేగం, నిర్వాహకుడు కన్నం వెంకట రమణరావు ప్రారంభించారు. అనంతరం విశాఖ నగరానికి చెందిన తాళ్లపాక సందీప్‌కుమార్, శ్రావణి శిష్య బృందాలు అద్భుతంగా నాట్య ప్రదర్శన చేసి మైమరపించాయి. శ్రీ నృత్య నికేతన్ నుంచి సీహెచ్.శ్రావణి, సిద్ధార్థ యోగి కళా నిలయం నుంచి ఎస్.ఎస్.వి.సత్యభాను, నాట్య ధ్వని డ్యాన్స్ అకాడమీ నుంచి ఎస్.శైలజ, భరతనాట్య కళాంజలి నుంచి సంతోషి విజయ, సుమధుర ఆర్ట్స్ అకాడమీ నుంచి శ్రవ్య మానస, అభినవ నృత్యనిలయం నుంచి దుర్గా, ఒడిశా డ్యాన్సర్ రత్నబాలి లహరిలను అతిథులు సత్కరించారు.

అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

మహారాణిపేట: జిల్లాలోని పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసేందుకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ మల్లికార్జున తెలిపారు. ఈ మేరకు www.ipr. ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం కొత్తగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరు కోసం జీవో 38 జారీ చేసిందన్నారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల నుంచి సిఫారసు లేఖ, పాస్ పోర్టు సైజు ఫొటో, అవసరమైన డాక్యుమెంట్లను పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని కలెక్టర్ సూచించారు. తదుపరి ప్రింట్ డాక్యుమెంట్ల కాపీలు, జత పరిచిన పత్రాలతో దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీల సెట్‌ను సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో సమర్పించాలన్నారు.

జిల్లా కోర్టు పీపీ జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు


కాండ్రేగుల జగదీశ్వరరావు

విశాఖ లీగల్: విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టెన్సెస్ కేసులు వాదించే పీపీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇన్‌చార్జ్, లా సెక్రటరీ అయిన సత్య ప్రభాకర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆ బాధ్యతలు చూస్తున్న ఎస్.కాళిదాసురెడ్డి పదవీ కాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో జగదీశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

భద్రతా ఏర్పాట్ల పరిశీలన


భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

కొమ్మాది : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వచ్చే నెల 3వ తేదీన జిల్లా పర్యటనలో భాగంగా రుషికొండ ఐటీహిల్స్, హెలిపాడ్, వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మతో కలసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.